కానిస్టేబుల్‌పై క్రమశిక్షణ చర్యలు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 3: మద్యం మత్తులో ఓ బిర్యాని సెంటర్‌లో హల్‌చల్ చేసిన కానిస్టేబుల్‌పై ఎస్పీ జీఆర్ రాధిక చర్యలు తీసుకున్నారు. గురువారం రాత్రి శ్రీకాకుళం రూరల్ పరిధి పెద్దపాడు పోలీసుస్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ గోపి తన మిత్రులతో కలిసి మద్యం మత్తులో రోణంకి యుగంధర్‌కి చెందిన బిర్యానీ సెంటర్‌కు వెళ్లాడు. బిర్యానీ కొని డబ్బులు చెల్లించకుండా యుగంధర్‌పై దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కానిస్టేబుల్ తీరుపై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం శాఖాపరమైన చర్యల్లో భాగంగా కానిస్టేబుల్ గోపీని సంతబొమ్మాళి పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు.

దిమిలాడలో శోకసంద్రం


నందిగాం : తహసీల్దార్ రమణయ్య మృతదేహం వద్ద జనసందోహం.. ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో

- తహసీల్దార్ హత్యతో ఉలిక్కిపడ్డ గ్రామస్థులు
- రమణయ్యకు అశ్రునివాళి
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు

నందిగాం, ఫిబ్రవరి 3: విశాఖపట్నం పరిధి కొమ్మాదిలో నివాసముంటున్న తహసీల్దార్ సనపల రమణయ్య (41)ను దారుణంగా హత్య చేయడంతో.. ఆయన స్వగ్రామం నందిగాం మండలం దిమిలాడలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు దిగ్ర్భాంతికి గురయ్యారు. రమణయ్య చిన్నప్పుడే తండ్రి రంగారావు మృతిచెందారు. తల్లి శకుంతలమ్మ, అక్క అమరావతి, సోదరుడు రోహిణీ రావు ప్రోత్సాహంతో ఆయన చదువుకున్నారు. ఎంఈడీ, ఎంఏ ఆంధ్రా యూనివర్సిటీలో ప్రథమస్థానంలో నిలిచారు. మారుమూల గ్రామం నుంచి గ్రూప్-2కు ఎంపికై ఉపతహసీల్దార్‌గా విధుల్లో చేరారు. తర్వాత తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. విశాఖ జిల్లా చిన్నగదిలి తహసీల్దార్‌గా పని చేశారు. ఇటీవల విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీ అయ్యారు. శుక్రవారం అక్కడ విధుల్లో చేరి.. రాత్రి ఇంటికి చేరుకున్న ఆయన హత్యకు గురవడంతో అంతా ఉలిక్కిపడ్డారు. శనివారం ఆయన మృతదేహాన్ని స్వగ్రామం దిమిలాడ తీసుకురాగా.. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తల్లి, సోదరితోపాటు భార్య అనూష, బంధువులు బోరున విలపించారు. ఏడేళ్ల కుమార్తె సహస్ర, మూడేళ్ల కుమారుడు కృష్ణరంగ రియాన్స్ బేలచూపులు అక్కడివారిని కలిచివేసింది. కుటుంబ సభ్యులు, బంధువులతోపాటు గ్రామస్థులంతా రమణయ్యకు అశ్రునివాళి అర్పించారు. అందరితో సరదాగా ఉండేవారని, నిజాయితీనే ఆయన ప్రాణాన్ని తీసిందని, రమణయ్య హత్యకు కారకులైన దుండగులను కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు కోరారు. రెవెన్యూ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు. ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. వైసీపీ జిల్లా సమన్వయకర్త పేడాడ తిలక్, నందిగాం ఎంపీపీ ఎన్. శ్రీరామ్మూర్తి, టీడీపీ నాయకులు పి. అజయ్‌కుమార్, ఎం.బాలకృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్ తదితరులు నివాళులర్పించారు. రమణయ్య చితికి... సోదరుడైన ఉపాధ్యాయుడు రోహిణిరావు నిప్పంటించి అంతిమసంస్కారాలు పూర్తిచేశారు. కన్నీటివీడ్కోలు పలికారు.


నందిగాం : నల్లబ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగులు


కుమార్తె సహస్ర బేలచూపులు..

విధుల్లో చేరిన కొద్ది గంటల్లోనే..

బొండపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బదిలీపై వచ్చిన విజయనగరం జిల్లా బొండపల్లి తహసీల్దార్ సనపల రమణయ్య(41) బాధ్యతలు స్వీకరించిన కొద్దిగంటల తర్వాత హత్యకు గురయ్యారు. బొండపల్లి తహసీల్దార్‌గా శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు రమణయ్య బాధ్యతలు స్వీకరించారు. 2.30 గంటల వరకు కార్యాలయంలోనే ఉన్నారు. ఉప తహసీల్దార్ రౌతు శంకరరావుతో కార్యాలయ సిబ్బంది పనితీరు, ఎన్నికల ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల సర్వేయర్ ఎచ్చెర్ల గౌరీశంకరరావుతో మాట్లాడి సర్వేప్రక్రియపై ఆరా తీశారు. ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలపై ప్రతీ ఒక్కరూ శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లతో ముఖాముఖి చేపట్టి సూచనలు అందజేశారు. ఆ తర్వాత కొమ్మాది బయలుదేరి ఇంటికి చేరుకున్నారు. శుక్రవారం రాత్రి దాడి జరగ్గా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందారు. ఈ విషయం తెలిసి కార్యాలయ సిబ్బంది నిర్ఘాంతపోయారు.

వజ్రపుకొత్తూరుతో అనుబంధం

వజ్రపుకొత్తూరు: తహసీల్దార్ రమణయ్యకు వజ్రపుకొత్తూరు మండల వాసులతో ఎంతో అనుబంధం ఉంది. 2016 నుంచి 2019 వరకు వజ్రపుకొత్తూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహించి అప్పటి ఎన్నికలకు ముందు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన కాలంలో వివాదరహితుడిగా పేరు తెచ్చుకున్నారు. 2018 అక్టోబరులో సంభవించిన తితలీ తుఫాన్ సమయంలో అనారోగ్యంతో బాధపడుతున్నా.. విధులకు హాజరై సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ముందుండేవారు. అలాంటి వ్యక్తి హత్యకు గురైన వార్త తెలుసుకొని పలువురు నేతలు, రెవెన్యూ సిబ్బంది దిగ్ర్భాంతికి గురయ్యారు.

ఉర్లాంలోనూ విషాదఛాయలు

నరసన్నపేట: తహసీల్దార్ రమణయ్య అత్తవారి గ్రామమైన ఉర్లాంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పదేళ్ల కిందట ఉర్లాం గ్రామానికి చెందిన పోలాకి రమణయ్య కుమార్తె అనూషతో రమణయ్య వివాహమైంది. ఇటీవల సంక్రాంతికి ఉర్లాం వచ్చిన రమణయ్య గ్రామస్థులతో సరదాగా గడిపారు. ఇప్పుడు ఆయన హత్యకు గురయ్యారని తెలుసుకుని జీర్ణించుకోలేకపోతున్నారు. అత్తమామలతో పాటు బంధువులు నందిగాం మండలం దిమిలాడ వెళ్లారు.


హిరమండలం: తహసీల్దారు కార్యాలయం వద్ద రెవెన్యూ ఉద్యోగుల నిరసన

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

హిరమండలం/ సరుబుజ్జిలి: తహసీల్దార్ రమణయ్యను హత్య చేయడం దారుణమంటూ.. రెవెన్యూ ఉద్యోగులు నిరసన చేపట్టారు. శనివారం హిరమండలంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. హత్యకు కారణమైన వారిని శిక్షించాలని, తహసీల్దార్ రమణయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సరుబుజ్జిలిలోనూ తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ ఉద్యోగులు నిరసన చేపట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. తహసీల్దార్ సనపల రమణయ్య.. సరుబుజ్జిలి మండల డీటీగా 2013 డిసెంబరు నుంచి 2014 అక్టోబరు వరకు విధులు నిర్వహించారు. ఆయన మృతిపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు సంతాపం వ్యక్తం చేశారు. హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


సరుబుజ్జిలి: తహసీల్దారు కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగుల నిరసన

అంకితభావంతో పనిచేయాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఫిబ్రవరి 3: అధికారులంతా అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్పీ జీఆర్ రాధిక, జేసీ ఎం.నవీన్, మునిసిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియాతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'రానున్న సార్వత్రిక ఎన్నికల విధుల్లో అందరూ సమన్వయంతో చురుగ్గా పనిచేయాలి. ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలి. సిబ్బందితో అప్రమత్తంగా పనిచేయించాలి' అని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నిషాకుమారి, డీఆర్వో ఎం.గణపతిరావు, జడ్పీ సీఈవో వెంకటరామన్, డీపీవో రవికుమార్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, డ్వామా పీడీ చిట్టిరాజు, డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, ఏపీసీ జయప్రకాష్, ఫైన్స్ డీడీ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, సీపీవో లక్ష్మీప్రసన్న, అరసవల్లి ఈవో హరిసూర్యప్రకాష్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్, చేనేతశాఖ అధికారి ధర్మారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



విసిగి.. వెనుదిరిగి..

- ఆసరా సభ జరుగుతుండగానే వెళ్లిపోయిన మహిళలు

డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం నాలుగో విడత చెక్కుల పంపిణీలో భాగంగా.. శనివారం హిరమండలంలోని బ్యారేజీ సెంటర్ సమీపంలో బహిరంగ సభ నిర్వహించారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆసరా సభకు అధిక సంఖ్యలో డ్వాక్రా మహిళలను రప్పించేందుకు వెలుగు సిబ్బంది సంఘ సభ్యులపై ఒత్తిడి చేశారు. సభకు కచ్చితంగా రావాలని, లేదంటే ఆసరా పథకం వర్తింపజేయబోమని, ఇతర పథకాలు కూడా నిలిపేస్తామని బెదిరించినట్టు విమర్శలు ఉన్నాయి. లబ్ధి పొందనున్న మహిళలంతా తప్పనిసరిగా సభకు రావాలని గ్రామంలో దండోరా కూడా వేయించారు. దీంతో చాలామంది అయిష్టంగానే సభకు హాజరయ్యారు. కాగా గంటల తరబడి నిరీక్షించడంతో విసిగిపోయారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రసంగిస్తుండగానే చాలామంది మహిళలు వెనుదిరిగి ఇంటి ముఖం పట్టారు.

- హిరమండలం

మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు

- 85 పరీక్షా కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు

కలెక్టరేట్, ఫిబ్రవరి 3: ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అధికారులను ఆదేశించారు. పరీక్షలకు సంబంధించి శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇంటర్ పరీక్షలు మార్చి 1 నుంచి 20 వరకు నిర్వహిస్తాం. ఈ నెల 5 నుంచి ఒకేషనల్ ప్రాక్టికల్స్, 11 నుంచి 20 వరకు జనరల్ ప్రాక్టికల్స్ జరగనున్నాయి. జనరల్ 43,071 మంది, ఒకేషనల్ 2,631 మంది మొత్తంగా 45,702 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 85 కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు పరీక్షలు జరగనుండగా.. 1600 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. 1,480 సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తామ'ని తెలిపారు. విద్యార్థులకు సరిపడా బస్సులను నడపాలని, విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలనిఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు సెల్‌ఫోన్లు వినియోగించరాదని స్పష్టం చేశారు. ఏఎస్పీ విఠలేశ్వరరావు మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద అదనపు బందోబస్తు అవసరమైతే తెలియజేయాలని, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో వేంకటేశ్వరరావు, ఆర్టీసీ పీఆర్వో శ్రీనివాసరావు, జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారి కె.ప్రకాశరావు, డాక్టర్ ప్రవీణ్, విద్యుత్తు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గరిష్ఠ వేతనం అందలే!


బూర్జపాడులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

- ఉపాధిహామీ కూలీల ఆవేదన
- పథకంలో మార్పులే కారణం!

(ఇచ్ఛాపురం రూరల్)

నిబంధనలతోపాటు పలు కారణాలతో ఉపాధిహామీ పథకం కింద కూలి గిట్టుబాటు కావడం లేదని వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులకు వెళితే రోజుకు రూ.450 నుంచి రూ.500 వరకు కూలి దక్కుతుందని.. ఈ పథకంలో పనికి తగ్గ వేతనం లేదంటున్నారు. ఏటా డ్వామాతో పాటు మండలస్థాయి అధికారులు ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించడం, గరిష్ఠ వేతనం అందుకునేలా చేయడం లక్ష్యంగా ఉపాధి పనుల ప్రణాళిక తయారు చేస్తుంటారు. గరిష్ఠ వేతనాన్ని రూ.272 నిర్ణయించగా.. జిల్లాలో దీన్ని పొందలేకపోతున్నారు. దీనికితోడు గతేడాది నుంచి వేసవి భత్యంతో పాటు గునపాలు, పారలు, టెంట్‌లు ఇవ్వడం నిలిపివేశారు. జిల్లాలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సగటున రూ. 252 వరకు కూలీ గిట్టుబాటు అవుతుంది. వారు రోజుకు సరాసరి రూ.20 చొప్పున వేతనాన్ని కోల్పోతున్నారు. సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం చేసిన కూలి గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 30 మండలాల్లో 3.84 లక్షల యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో 6.20లక్షల మంది ఉపాధిహామీ కూలీలున్నారు. వీరిలో ప్రస్తుతం 1.40లక్షల మంది వేతనదారులు రెండు నెలలుగా పనులు చేస్తున్నారు. ఉపాధి నిధులను కేంద్రం విడుదల చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం వీటిని వివిధ పథకాలకు మళ్లిస్తుండటం గమనార్హం. జిల్లాలో 2022 వరకు టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించేవారు. రాష్ట్ర ప్రభుత్వం దీన్ని ఉపయోగించి మెటీరియల్ కంపోనెంట్ నిధులు లాక్కుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి నియంత్రణ చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మళ్లించకుండా.. ఈ పథకం అమలును పూర్తిగా తన పరిధిలోకి తీసుకుంది. ఈ మేరకు నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) రూపొందించిన పోర్టల్‌లో అన్ని వివరాలు నమోదు చేయాలి. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ పర్యవేక్షణలో ఇది పని చేస్తోంది. ఈ వ్యవస్థ వచ్చాక పథకం అమల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో పనులకు వెళ్లేవారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పనిలోకి వస్తే ఒక్కొక్కరికీ రూ.272 వేతనం వస్తుందని క్షేత్రస్థాయి సిబ్బంది వీరిని తీసుకెళుతున్నా, తీరా చేతికి రూ.252 లోపు వస్తోందని కూలీలు పేర్కొంటున్నారు. గతంలో వినియోగించిన సాఫ్ట్‌వేర్ ప్రకారం.. ఎన్ని రోజులు పని చేసినా గరిష్ఠ వేతనం పొందేవరకు ఒక పనిదినంగా చూసేవారు. దీనివల్ల కూలి గిట్టుబాటు కావడంతో పాటు ఎక్కువ రోజులు పని దొరికేది. ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ వచ్చాక ఒక రోజులో ఎంత పని చేసినా.. ఒక పనిదినం పూర్తయినట్లు లెక్క. జిల్లావ్యాప్తంగా సరాసరి వేతనం ఒక్కొక్కరికీ రూ.252 లోపు ఉండగా, కొన్ని మండలాల్లో మరీ తక్కువగా వస్తోందని వేతనదారులు ఆందోళన చెందుతున్నారు.

పని బట్టి కూలి

ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే.. ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం అందుకోవడం సులువే. ఒక పూటలో పనులు చేయలేరనే రెండు పూటలా కల్పిస్తున్నాం. ఈ విషయంపై క్షేత్రస్థాయి సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ వారం సగటు వేతనం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

- జి.వి.చిట్టిరాజు, డ్వామా పీడీ, శ్రీకాకుళం

కోర్టు ఆదేశాలు తూచ్

- పాఠశాల మైదానంలో సచివాలయం నిర్మాణం
- నేడో రేపో ప్రారంభోత్సవానికి సన్నాహాలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

అధికార పార్టీ నేతలు.. వారి అనుచరులు కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. పాఠశాల మైదానాల్లో సచివాలయాలు నిర్మించకూడదని హైకోర్టు స్పష్టంగా ఆదేశాలు జారీచేసింది. ఒకవేళ నిర్మిస్తే వాటిని విద్యాశాఖ అవసరాలకు వినియోగించుకునేలా అప్పగించాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పలుచోట్ల చేపట్టిన నిర్మాణాలు నిలిచిపోయాయి. కానీ కవిటి మండలంలో మాత్రం అధికారపార్టీ నేతలు నిబంధనలకు పాతరేసేశారు. బి.గొనపపుట్టుగ పాఠశాల మైదానంలో సచివాలయాన్ని నిర్మించేశారు.


కవిటి మండలం బి.గొనపపుట్టుగలో పాఠశాల మైదానంలో నిర్మించిన సచివాలయం

బి.గొనపపుట్టుగలో ప్రాథమిక పాఠశాలకు 0.057 సెంట్ల స్థలంలో రెండు భవనాలున్నాయి. వీటిలో ఒకటి 646.38 చదరపు అడుగుల్లో నిర్మించగా ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో కూల్చేశారు. డీపీఈపీ కింద 520 చదరపు అడుగుల విస్తీర్ణంలో మరో భవనాన్ని నిర్మించారు. కూల్చేసిన భవనం స్థానంలో గ్రామసచివాలయం నిర్మాణానికి పూనుకున్నారు. ఇదే సమయంలో హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం రాష్ట్రవ్యాప్తంగా కలిపి దాఖలయ్యాయి. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో నిర్మాణాలు నిలుపుదల చేయాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. పాఠశాలల ఆవరణలో నిర్మించిన భవనాలను అవే పాఠశాలలకు అప్పగించాలని ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు పనులు నిలుపుదల చేసి భవనాన్ని పాఠశాలకు అప్పగిస్తున్నట్టుగా అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇదంతా కాగితాల్లో పక్కాగా నమోదైంది. ఇప్పుడు రెండేళ్ల కాలం గడిచిపోయాక.. అందరూ ఈ విషయాన్ని మరిచిపోయారని అధికారపార్టీ నాయకులు భావించారు. ఇటీవలే భవనానికి మెరుగులు దిద్ది.. కొద్దిపాటి మరమ్మతులు చేపట్టి సచివాలయం భవనంగా మార్పుచేశారు. రేపోమాపో దీనిని ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నారు. అధికారులు కూడా ఈ వ్యవహారంపై పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. పాఠశాల ఆవరణలో నిర్మించిన భవనాన్ని విద్యార్థులకు మాత్రమే పరిమితం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టీడీపీ విజయానికి సహకరించండి

టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శనివారం పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ, పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున క్యాడర్ పాల్గొంది.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: శిరీష

కాశీబుగ్గ, ఫిబ్రవరి 3: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కోరారు. శనివారం పట్టణ పరిధిలోని 10, 11 వార్డుల్లో వార్డు కు పోదాం కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీడీపీ అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. సీఎం జగన్ అరాచకాలపై చైతన్యం చేయాలన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, సూర్యనారాయణ, చిలకమ్మ, చంద్ర శేఖర్ త్యాడి, ఉమాకాంత్, సప్ప నవీన్, రవిశంకర్ గుప్తా, శంకర్, మురళి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: రాష్ట్ర భవిష్యత్ బాగుపడాలన్నా, అభివృద్ధి పథంలో నడవాలన్నా అది చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. శనివారం లింగాలవలస పంచాయతీ హరిపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెండ దమయంతి, హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్, ఇప్పిలి జగదీష్, బొడ్డేపల్లి రామారావు, బగాది సునీల్, ఎస్.భాస్కరరావు, గోవింద్, సింహాచలం, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు వెళ్లాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ అన్నారు. పొన్నుటూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. టీడీపీ మేని ఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జలుమూరు (సారవకోట): పరిపాలనానుభవం కలిగి విజన్ గల నాయకుడు చంద్రబాబు నాయకత్వంలో పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి సురవరపు తిరుపతిరావు అన్నారు. చిన్నకిట్టాలపాడు పంచాయతీ వెంకంపేటలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ అరాచకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురవరపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. కొమ్మసరియాపల్లి గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను, టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. సర్పంచ్ తాడేల భీమారావు, మాజీ సర్పంచ్ బోర తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చ ఈశ్వరరావు అన్నారు. కంబాల రాయుడిపేట, ఉద్దానం రామకృష్ణాపురం, కిడిసింగి, వజ్రపుకొత్తూరు, బైపల్లి గ్రామాల్లో పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానులతో సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. టీడీపీ అమలు చేయనున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్ని రమణ, అర్సవెళ్లి ఉమా మహేశ్వరరావు, తెప్పల చాణక్య, పోతనపల్లి సాంబమూర్తి, కంబాల దానేష్, తులే అప్పాజీ, చింత నారాయణ, మధనాల జోగారావు పాల్గొన్నారు. ● **ఆమదాలవలస:** దేశంలోనే అత్యధిక అప్పులతో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ఓటర్లే కాపాడాలని టీడీపీ నాయకులు మొదలవలస రమేష్, బోర గోవిందరావు అన్నారు. శనివారం మెట్టక్కివలసలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి భవిష్యత్తుపై ప్రజలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని, టీడీపీని గెలిపించాలని కోరారు. అక్కివలస గ్రామంలో బాబు ష్యూరిటీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాడ విజయ్‌కుమార్, షేక్ మాలిక్, నాగళ్ల మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. ● **పొందూరు:** మండల కేంద్రంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, కె.శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి టీడీపీ అందించనున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ● **ఇచ్ఛాపురం రూరల్:** భవిష్యత్ తరాలు బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ నాయకులు దూపాన సూర్యనారాయణ అన్నారు. బిర్లంగి గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిప్పన బాల, ఎన్.నూకయ్య, మహిళలు పాల్గొన్నారు. ● **జి.సిగడాం:** టీడీపీతోనే రాష్ట్రంలో సంక్షేమం సాధ్యమని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి జక్కంపూడి దాసు అన్నారు. శనివారం దేవర వలస, వెలగాడ గ్రామాల్లో బాబూష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ మేనిఫెస్టోని గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గొల్లాజీ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


కాశీబుగ్గ: మాట్లాడుతున్న గౌతు శిరీష


టెక్కలి: హరిపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు


కొత్తూరు: పొన్నుటూరులో కరపత్రాలు అందిస్తున్న సాగర్


సారవకోట మండలం వెంకంపేటలో భవిష్యత్తు గ్యారెంటీ


ఆమదాలవలస: మెట్టక్కివలసలో కరపత్రాలిస్తున్న నేతలు




పొందూరు, ఇచ్ఛాపురం రూరల్: బిర్లంగి, జి.సిగడాం: టీడీపీ మేనిఫెస్టోని గ్రామస్థులకు వివరిస్తున్న టీడీపీ నాయకులు


వజ్రపుకొత్తూరు: కంబారాయుడిపేటలో మాట్లాడుతున్న పుచ్చ ఈశ్వరరావు

'కింజరాపు' కుటుంబంపై విమర్శలు మానుకోవాలి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నందిగాం: జిల్లా అభివృద్ధే అజెండాగా ప్రజల మధ్య పని చేసే కింజరాపు కుటుంబాన్ని విమర్శించే హక్కు వైసీపీ నాయకులకు లేదని నందిగాం టీడీపీ నాయకులు అన్నారు. శనివారం పార్టీ కార్యా లయంలో టీడీపీ నేతలు పి.అజయ్‌కుమార్, ఎం.బాలకృష్ణ, పి.చంద్ర శేఖర్, కె.ప్రసాదరావు విలేకరులతో మాట్లాడుతూ... దివంగత కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడు విజన్ ఉన్న నాయకుడని, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ స్పీకర్ దివంగత బాలయోగి క్లాస్‌మేట్ అని, అటువంటి వ్యక్తి చదువుకోలేదని వైసీపీ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పార్లమెంటులో సమస్యలను ప్రస్తావించి ఎంపీ రామ్మోహన్ నాయుడు ప్రధానితో పాటు అనేక మంది ఇతర ఎంపీలతో ప్రశంసలు పొందారని, అటువంటి వ్యక్తులపై అవాకులు, చెవాకులు మాట్లాడడం తగదన్నారు. 2014-19 మధ్య అచ్చెన్నాయుడు మంత్రిగా ఎనలేని అభివృద్ధి చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉండి కూడా ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో అల్లాడిన రైతులకు కనీసం నీరందని పరిస్థితి మీదని విమర్శించారు. విమర్శలు మాని హుందాగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఎం.లోకనాథం, టి.ఉమామహేష్, ఎస్.జానకిరాం, ఎం.నాగరాజు, జనసేన నాయకుడు టి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మెగా కాదు దగా డీఎస్సీ: కలమట



కొత్తూరు: సీఎం జగన్ త్వరలో మెగా డీఎస్సీ ప్రకటిస్తామన్నారని, అది మెగా డీఎస్సీ కాదని దగా డీఎస్సీ అని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ విమర్శించారు. శనివారం మాతల గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని డీఎస్సీ పేరుతో మరోసారి నిరుద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 50,892 ఖాళీలుంటే 6,100 పోస్టులకు నోటిఫికేషన్ జారీ కి చర్యలు తీసుకోవడం ఇందుకు ఉదాహరణ అన్నారు. తహసీల్దార్ రమణయ్య హత్య దారుణమని అన్నారు. బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కోటబొమ్మాళి: సీఎం జగన్ ప్రకటించనున్నది మెగా డీఎస్సీ కాదని, ఇది దగా డీఎస్సీ అని టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ ఎంపీపీలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. డీఎస్సీ పేరుతో ఎన్నికల ముందు సీఎం జగన్ కొత్త డ్రామాకు తెరతీశారని విమర్శించారు. జనవరి ఒకటిన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నాలుగున్నరేళ్లు నిరుద్యోగులను మోసం చేశారన్నారు. సీఎంకు తన భద్రత తప్ప రాష్ట్రంలో శాంతి భద్రతలపై శ్రద్ధ లేదన్నారు. తహసీల్దార్ రమణయ్య హత్య దారుణమని, శాంతి భద్రతలు లేవని చెప్పేందుకు ఈ ఘటన అద్దం పడుతోందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నంబాళ్ల శ్రీనివాస్, నాయకులు కర్రి అప్పారావు, గొండు లక్ష్మణరావు, సాసుమంతు ఆనందరావు, కోరాడ గోవిందరావు, హనుమంతు అప్పలరాజు, ముత్తురాజు, పూజారి శైలజ, బాడాన రమణమ్మ, దేవాది సింహాద్రమ్మ, బెండి అన్నపూర్ణ పాల్గొన్నారు.


కోటబొమ్మాళి: మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అధికారులకు రక్షణ లేకుండా పోయింది

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

పలాస: తహసీల్దార్ రమణయ్య హత్యతో రాష్ట్రంలో అధికారులకు కూడా రక్షణ లేకుండా పోయిం దని రుజువైందని, ఆయన హత్య బాధాకరమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తోటి అధికారి హత్య జరిగితే రెవెన్యూ ఉద్యోగులు కనీసం కూడా నోరువిప్పకపోవడం దారుణమన్నారు. రమణయ్య హత్యపై ప్రభుత్వాన్ని నిలదీయక పోవడాన్ని తప్పుబట్టారు. వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపకపోతే రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తారని హెచ్చరించారు. తితలీ తుఫాన్ సమయంలో రమణయ్య వజ్రపుకొత్తూరు మండలంలో విశేష సేవలు అందించి గుర్తింపు పొందారని, మంచి అధికారిని కోల్పోవడంపై విచారం వ్యక్తం చేశారు. బాధ్యులను తక్షణం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

హత్యకు కారణమైన వారిని అరెస్ట్ చేయాలి

నరసన్నపేట: రమణయ్య హత్యకు కారణమైన వారిని అరెస్ట్ చేసి తక్షణం చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ల అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తహసీల్దార్ రమణయ్య కుటుంబాన్ని తక్షణం ఆదుకోవాలని, అధిక భూ వివాదాలు ఉన్న మండలాల తహసీల్దార్లకు ప్రత్యేక రక్షణ కల్పించాలన్నారు. విశాఖపట్నంలో భూ సంబంధిత విషయాలపై వీఆర్వోలపై క్రిమినల్ కేసులు పెట్టాలని జిల్లా అధికారులు ఆదేశాలివ్వడాన్ని ఆయన ఖండించారు.

జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పలాస: కేరళ రాష్ట్రంలో మాదిరిగా మన రాష్ట్రంలో జీడి బోర్డు ఏర్పాటు చేసి ఉద్దానం జీడి రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణయాదవ్ ఒక ప్రకటనలో కోరారు. జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాలకు గురై పంటను నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఎస్సీలో ఒడియా పోస్టులను భర్తీ చేయాలి

పలాస: డీఎస్సీలో ఖాళీగా ఉన్న ఒడియా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణపాడి, ఒడియా డీఐ దుర్గాప్రసాద్ చౌదరి, ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన ఆర్యదర్శి బృందావన్ దొళాయ్ కోరారు. ఈ మేరకు శనివారం మంత్రి అప్పలరాజును కలిసి వినతిపత్రం అందించారు. ఒడియా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. 39 ఒడియా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయకుండా అన్యాయం చేశారని, దీనివల్ల ఒడియా విద్యార్థులకు బోధనకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బుడార్సింగి సర్పంచ్ సురేష్‌పాణిగ్రాహి, గోవింద్ బెహరా, రామహరి పాడి, ఎస్.మోహనరావు, భగీరథి, విజయ్ ప్రధాన్, నిరాకర్ పాండవ, దుర్యోధన, భావనానంద ఉన్నారు.

దుకాణాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పలాసరూరల్: కార్మికశాఖ పరిధిలోని అన్ని దుకాణాలు, సంస్థల యజమానులు ఆంధ్ర ప్రదేశ్ దుకాణ చట్టాల ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని టెక్కలి సహాయ కార్మికశాఖాధికారి జి.ఎల్లాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలు, సంస్థల యజమానులు మీసేవా కేంద్రాల్లో గాని, గ్రామ, వార్డు సచివాలయాల్లో గాని ఈనెలాఖరులోగా రిజిస్ట్రేషన్ చేయించాలని, ఒక వేళ రిజిస్ట్రేషన్ ఉంటే దానిని రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

సమస్యలను పరిష్కరించాలి

నరసన్నపేట: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఈవో కార్యాలయం వద్ద శనివారం మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎండీఎంను ప్రైవేటుకు అప్పగించాలన్నారు. ఉన్నత పాఠశాలలో ఎండీఎంలకు వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవో ఉప్పాడ శాంతారావుకు వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎండీఎం నిర్వాహకులు ఎ.రాధ, బి.లక్ష్మి, కె.రమణమ్మ, ఎర్ర రత్నం, ఎం.సూరమ్మ, టి.కుమారి, ఎ.జ్యోతి, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఎంఈవో శాంతారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీఎం నిర్వాహకులు

బాధితులకు పరామర్శ

ఎల్.ఎన్.పేట: లక్ష్మినర్సుపేట బజారులో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులను మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి శనివారం పరామర్శించారు. తనవంతు ఆర్థిక సాయాన్ని అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు కె.చిరంజీవి, ఎంపీటీసీ ఎస్. మోహనరావు, పాండురంగనాధరాజు, సవ్రరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే రెడ్డి శాంతి బాధితులు పరామర్శించారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన సాయం కోసం కృషి చేస్తానన్నారు. ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి, డీటీ రషీద్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.


అగ్ని ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కలమట రమణ

'ఉపాధి' ఈసీ నియామకంలో వైసీపీలో ఆధిపత్య పోరు

సంతబొమ్మాళి: ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ నియామకంలో అధికార వైసీపీలో ఆధిపత్యపోరు సాగుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. రెండేళ్ల కిందత ఈసీ బదిలీ కాగా సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ మునీంద్రను ఇన్‌చార్జిగా నియమించారు. అయితే కొద్ది రోజులుగా ఎంపీపీ భర్త, ఈసీల మధ్య పొరపొచ్చాలు రావడంతో మునీంద్రకు పోలాకి మండలానికి బదిలీ అయింది. ఆ తరువాత ఈసీ పోస్టు భర్తీ వైసీపీలోని రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు మధ్య ఊగిసలాడుతోంది. కోటబొమ్మాళిలో టెక్నికల్ అసిసెంట్‌గా పని చేస్తున్న పి.దామోదరరావును ఇన్‌చార్జి ఈసీగా నియమిస్తూ పీడీ ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఆయన జాయిన్ అయ్యేందుకు రాగా ఎంపీపీ జాయిన్ చేసుకోలేదు. ఆయన కన్నా సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ ఉప్పాడ ధర్మారావును ఈసీగా నియమించాలని ఎంపీపీ వర్గం పట్టుబడుతోంది. దామోదరరావును ఈసీగా నియమిస్తూ పీడీ ఆదేశాలిచ్చినా జాయిన్ చేసుకోక పోవడంపై శుక్రవారం మండలంలో పర్యటించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు రుంకు హనుమంతుపురం సర్పంచ్ యెన్ని మన్మథరావు ఫిర్యాదు చేశారు. దువ్వాడ ఎదుటే ఎంపీపీ తీరుపై ఆయన ధ్వజ మెత్తినట్లు తెలిసింది. గత పదేళ్లుగా ధర్మారావు మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారని, ఆయనకు మండల స్థితిగతులు తెలుసునని, ఆయనను నియమిస్తే బాగుంటుందని ఎంపీపీ వర్గం వాదిస్తోంది. ఇరువర్గాల ఆధిపత్యపోరు వల్ల ఈసీ నియామకానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది.

దీనిపై ఎంపీడీవో జి.ఉమాసుందరిని వివరణ కోరగా ఈసీగా దామోదరరావు ను నియమిస్తూ పీడీ ఉత్తర్వులిచ్చారు. అయితే ఎంపీపీ నోట్ అప్రోవల్ కాకపోవడం వల్ల జాయిన్ చేసుకోలేదన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

టెక్కలి: జాతీయ లోక్‌అదాలత్‌ను స్థానిక కోర్టు సముదాయంలో మార్చి 9న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికార సంఘం చైర్మన్ జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన క్రిమి నల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నామని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు. లోక్‌అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వబడుతుందన్నారు.

రాజీ మార్గం ద్వారా కేసుల పరిష్కారం

కోటబొమ్మాళి: రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించు కోవచ్చని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షురాలు, జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు.

శనివారం స్థానిక కోర్టులో న్యాయవాదులు, పోలీస్ అధికారులు, బ్యాంకు అధికారు లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్చి 9న కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కార్యదర్శి వెలమల అప్పలనాయుడు, ఏపీపీ డి.హరి ప్రియ, న్యాయవాదులు పల్లి వాసుదేవరావు, వాన నేతాజీరావు, ఎండ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి

నరసన్నపేట: ఉపాధి హామీ పథకం సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ జీవీ చిట్టిరాజు సూచించారు. ఉర్లాం పంచాయతీ పరిధిలో తోటల పెంపకం, గృహనిర్మాణం, చెరువులో పూడికతీత పనులను శనివారం పరిశీలించారు. వ్యక్తిగత తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో యుగంధర్, ఈసీ అప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ

ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మృతి

నందిగాం: సుబ్బమ్మపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కె.గోపాలకృష్ణ(76) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈయన ఏపీఎస్పీ అడ్మినిస్ట్రేటివ్ ఉద్యోగిగా విధులు నిర్వహించి రిటైరయ్యారు. ఈ ఆలయానికి సుమారు 20 ఏళ్లుగా ధర్మకర్తగా కొనసాగుతు న్నారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు కుమార్తె ఉన్నారు. గోపాలకృష్ణ మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.


గోపాలకృష్ణ (ఫైల్)

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

హిరమండలం: రహదారులపై వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కొత్తూరు సీఐ వేణుగోపాలరావు అన్నారు. శనివారం హిరమండలం బ్యారేజీ సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించి అన్ని ధ్రువపత్రాలు ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

పాతపట్నం: పాతపట్నం తహసీల్దార్‌గా వైఎస్‌వీవీ ప్రసాదరావు శనివారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కె.రవిచంద్ర అనకాపల్లి బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న ప్రసాదరావు ఇక్కడికి వచ్చారు. ఆయనకు వీఆర్వోలు, సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

నరసన్నపేట: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మార్సీ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు కె.వైకుంఠరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.దమయంతి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా..

పలాసరూరల్: ఇన్‌చార్జి ఎంపీడీవోగా మెట్ట వైకుంఠరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన రమేష్ నాయుడుకు బొబ్బిలికి బదిలీ కాగా ఈవో పీఆర్డీ వైకుంఠరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.







మద్యం మత్తులో యువకుడి మృతి

ఆమదాలవలస: పట్టణంలోని మెట్టక్కివలస వద్ద శనివారం మద్యంమత్తులో చీలు రాబిడ్‌సన్ (37) అనే యువకుడు మృతి చెందినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. విశాఖ జిల్లా పెందుర్తి ప్రాంతానికి చెందిన రాబిడ్‌సన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓ వివాహానికి మున్సిపాలిటీలోని గాంధీనగర్‌కు శుక్రవారం వచ్చారన్నారు. మధ్యాహ్న సమయంలో అతిగా మద్యం తాగి మార్కెట్‌లోని ఓ వరండాలో ఉన్న విషయాన్ని కుటుంబ సభ్యులు గ్రహించి ఇంటికి తీసుకెళ్లి వివాహం వద్ద కాకుండా విశాఖ నుంచి వారు వచ్చే బస్సులో సీటుపై పడుకోబెట్టి పక్కకు పడిపోకుండా ఓ బెల్ట్‌ను ఏర్పాటు చేశారు. మద్యం మత్తులో ఉన్న రాబిడ్‌సన్ కిందకు పడిపోయిన సమయంలో ఆ బెల్ట్‌లో అతడి మెడను ఇరుక్కోవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రాబిడ్‌సన్ అన్న విజయరామరాజు మరికొందరు సాయంతో చికిత్స నిమిత్తం రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిరారించారు. విజయరామరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం క్రైం: ఏడు రోడ్ల కూడలి సమీపంలోని పాత వంతెనపై బైక్ స్కిడ్ అవ్వడంతో ఓ వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కలెక్టర్ బంగ్లా సమీపంలోని రాధాకృష్ణ నగర్ చెందిన ఒనం అచ్చయ్యకు ముగ్గురు పిల్లలు. వారిలో చిన్నవాడైన పవన్‌కుమార్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం 3.30కి విధులకు హాజరుకావడానికి వెళ్తూ నాగావళి వంతెన మీద ద్విచక్రవాహనం స్కిడ్ కావడంతో పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై రక్తపు మడుగులో ఉన్న పవన్ కుమార్‌ను స్థానికులు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. గాయపడిన పవన్ అపస్మారక స్థితికి చేరుకోవడంతో రిమ్స్ నుంచి కిమ్స్‌కు తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులకు పవన్ తండ్రి ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు సేకరించి ట్రాఫిక్ పోలీసులకు విషయం తెలపడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ ప్రమాదం సెల్ఫ్ డ్రైవింగ్ వల్లే జరిగిందని డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాద్ మీడియాకు తెలిపారు.

ఆవుల అక్రమ రవాణా.. గోశాలకు తరలింపు

కొత్తూరు: కర్లెమ్మ గ్రామం వద్ద బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 11 ఆవులను కొత్తూరు పోలీసులు అడ్డుకున్నారు. పశువులను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి పశువుల గోశాలకు తరలించారు. ఎవరైనా పశువులను అక్రమ రవాణా చేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని ఎస్ఐ అహ్మద్ హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ చోరీ

టెక్కలి: నీలాపురం సమీపంలో గల మదనగోపాల సాగరం ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లో లక్షల రూపాయలు విలువ గల కాపర్ చోరీకి గురైంది. శనివారం అక్కడ పనిచేసే సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించి అటు ఏపీఎస్‌పీడీసీ, ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం తెలియజేశారు. ఇదిలా ఉండగా రెండు రోజులు కిందట నందిగాం మండలం సుభద్రాపురం ఎత్తిపోతల పథకం, రెండు నెలల కిందట చిన్నసాన ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌చోరీకి గురైనట్టు తెలుస్తుంది. ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిచి ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ చోరీకి పాల్పడుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ తమ్మినేని ఈశ్వరరావు వద్ద ప్రస్తావించగా మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకం వద్ద కాపర్ చోరీకి గురైనట్టు సమాచారం సిబ్బందితో తెలిసిందని సంబంధిత ఏపీఎస్‌పీడీసీ అధికారులు పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

డెత్ రిలీఫ్ ఫండ్ అందజేత

శ్రీకాకుళం క్రైం: ఎచ్చెర్ల సాయుధ దళంలో ఎస్ఐగా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన ఎస్ఐ బెన్నయ్య కుటుంబానికి పోలీసు అసోసియేషన్ తరుపున డెత్ రిలీఫ్ ఫండ్‌ను అందజేశారు. ఎస్ఐ స్వగ్రామమైన సీతంపేట మండలం ఒంద్రుజోల గ్రామంలో బెన్నయ్య భార్య నీలవేణి, కుటుంబ సభ్యులను అసోసియేషన్ సభ్యులు రూ.లక్ష చెక్కును శనివారం అందజేశారు. అసోసియేషన్ సభ్యులు ఆర్‌.కృష్ణంనాయుడు, కె.భుజంగరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

కమిషనర్‌ను కలిసిన హోటల్స్ అసోసియేషన్ సభ్యులు



కమిషనర్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అరసవిల్లి: నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తమీమ్ అన్సారియాను జిల్లా హోటల్స్ అసోసియేషన్ సభ్యులు శని వారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్ట నాగరాజు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎన్వీడీ వినోద్, పూర్వ అధ్యక్షుడు జేఎంఆర్ రాజశేఖర్, సుదర్శన్, టంకాల కృష్ణ, కెల్ల కిశోర్‌కుమార్, సతీష్, శ్రీను, కోరాడ రాజు, కట్టా భవానీ శంకర్, మాధవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

లావేరు: ప్రతీ ఒక్కరు రోడ్డ భద్రతా నియమాలు పాటించాలని ఆప్కో ఇంఫ్రాటెక్ బృందం ప్రతినిధులు చంద్రమౌళి, ఉమేష్ కుమార్, రహదారి భద్రతా అధికారి నిరాల కూర్మారావు అన్నారు. శనివారం తాళ్లవలస ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. రహదారిపై నడిచేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు.

ఎస్ఐగా స్వామినాయుడు

లావేరు: లావేరు ఎస్ఐగా సీహెచ్ స్వామినాయుడు నియమితులైయ్యారు. శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విశాఖ సిటీలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన ఎ.కోటేశ్వరరావును శ్రీకాకుళం ఎస్‌బీకి బదిలీపై వెళ్లారు.

బకాయిలు చెల్లించాలి



వర్సిటీలో ఫోన్ ఇన్‌లో పాల్గొన్న రిజిస్ట్రార్ అడ్డయ్య తదితరులు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ తరపున అంతర రాష్ట్ర క్రీడా పోటీలకు హాజరైన క్రీడాకారులకు బకాయిలను చెల్లించాలని పలువురు విద్యార్థులు ఫోన్ ఇన్ లైవ్‌లో కోరారు. వర్సిటీలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ వర్సిటీ కార్యక్రమంలో బకాయిలు చెల్లించాలన్నారు. సెమిస్టర్ పరీక్షలకు మునుపు వార్షిక డిగ్రీ పరీక్షలు రాసి ఫెయిలైన విద్యార్థుల కోసం స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని పలువురు కోరారు. వర్సిటీ అనుబంధ కళాశాలల్లో ఉద్యోగ మేళాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని మరికొంత మంది విద్యార్థులు విన్నవించారు. వర్సిటీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరిట ప్రత్యేక చైర్‌ను ఏర్పాటు చేయాలని పలు సంఘాల విజ్ఞప్తి చేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, సీహెచ్ రాజశేఖరరావు, సీడీసీ డీన్ పీలా సుజాత, డీన్ మురపాన అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి

అరసవల్లి: రథసప్తమి ఏర్పాట్లను పక్కాగా చేయాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఆదిత్యాలయ అనివెట్టి మండపంలో రథసప్తమి వేడుక ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులు నియమ నిబంధనలను పాటించాలని, అప్పుడే వేడుకలలో తప్పులు జరిగేందుకు ఆస్కారం ఉండదన్నారు. గత సంవత్సరం అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు వేడుకలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్, ఆలయ పాలకమండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇది దగా డీఎస్సీ

- 50వేల ఖాళీలుంటే.. ఆరు వేలకే నోటిఫికేషన్
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్



మాట్లాడుతున్న కూన రవికుమార్

అరసవల్లి: అధికారంలోకి వస్తే వెంటనే మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని హామీలు గుప్పించిన జగన్‌రెడ్డి కేవలం 6,100 పోస్టులకే డీఎస్సీ ప్రకటించబోవడం దారుణమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాల యంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అని విమర్శిం చారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను గుర్తించిందని, ఇప్పుడు ముఖ్యమంత్రి కేవలం 6,100 పోస్టులతో చేతులు దులుపుకుంటున్నారని, ఎవరిని మోసం చేయడానికి ఈ ప్రకటనలని ప్రశ్నించారు. జనవరి 1న జాబ్ క్యా లెండర్ విడు దల చేస్తానని, నాలుగున్నరేళ్లు గడిచినా అతీ గతీ లేదని, కల్లబొల్లి మాటలు చెప్పి నిరుద్యోగులను వంచించేందు మరో డ్రామాను తెరపైకి తీసుకువచ్చారని, ఈ డ్రామాలను ఎవరు నమ్ముతారని ఎద్దేవా చేశారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగిత 11 శాతం ఉంటే రాష్ట్రంలో మాత్రం 24 శాతంగా ఉందని, ఇది ప్రమాదకర పరిస్థితి అని అన్నారు. యువతను వంచించి నిరుద్యో గాంధ్రప్రదేశ్, కల్తీ మద్యం అమ్మకాలతో మద్యాంధ్ర ప్రదేశ్, యువతను మత్తులో ముంచి గంజా యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చి దిద్దిన ఘనత మాత్రం జగన్ రెడ్డిదేనన్నారు. టీడీపీ పాలనలో ఏపీ పెట్టుబడుల్లో నెంబర్ వన్‌గా ఉంటే గంజాయి రవాణాలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని, ఇదీ వైసీపీ పాలనలో సాధించిన ప్రగతి అని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి సభ కోసం ఇంటర్ పరీక్షను వాయిదా వేయడం, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం కాదా అని నిలదీశారు. రాజకీయ కక్షసాధింపుల కోసం జగన్ ఖాకీలను తన ప్రైవేట్ సైన్యంగా వాడడంతో వారికీ నేరాలు అలవా టైపోయాయన్నారు. ఈ అరాచక పాలనకు అంతిమ ఘడియలు సమీపించాయని, ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

వైసీపీ పాలనలో దగాపడ్డ యువత



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

అరసవల్లి: వైసీపీ పాలనలో యువత అన్ని విధాలు గా దగాపడ్డారని నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి విమర్శించారు. శనివారం నగరంలోని స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉంటుందని, అటువంటి యువతను సంవత్సరానికి 2లక్షల ఉద్యోగాలని, మెగా డీఎస్సీతో వేలాది ఉపాధ్యాయ పోస్టులని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి దారుణంగా మోసం చేశాడని దుయ్యబట్టారు. టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బలగ ప్రహర్ష, కార్యదర్శి గుర్రాల సుమంత్, ఉపాధ్యక్షుడు జె.సంతోష్ కుమార్, సభ్యులు పల్లి ధర్మేంద్ర, ఇప్పిలి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగతంగా విస్తృతపర్చాలి

ఆమదాలవలస: సంస్థాగతంగా మరిన్ని కార్యక్రమాలు విస్తృతపర్చాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు మాస్టార్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ఎస్ కల్యాణ మండపంలో ఆమదాలవలస జోనల్ కన్వీనర్ జనార్దనరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. స్వామివారి శతజయంతి ఉత్సవాలు సందర్భంగా ప్రతి యూనిట్‌లో బాలవికాస్ సేవ, ఆధ్యాత్మిక, యువజన విభాగం సేవలు రెట్టింపు స్థాయిలో చేయాలన్నారు. ముందుగా ఆమదాలవలస సమితి స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా మెడికల్ ఇన్‌చార్జి పి.తాతయ్య, గ్రామసేవ ఇన్‌చార్జి ఎం.రవీంద్రబాబు, రాష్ట్ర విద్యాజ్యోతి ఇన్‌చార్జి గురుప్రసాద్, జిల్లా పతాధికారులు అనాథగుప్త, అమ్మాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్టుల పంపిణీ

కవిటి: స్థానిక ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో షటిల్ క్రీడాకారులకు శనివారం టీ షర్టులను పంపిణీ చేశారు. కవిటికి చెందిన పి.రామారావు సహకారంలో ఇండోర్ క్రీడాకారులు 20 మందికి వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో చల్లా రమేష్, ఎస్.సూరిబాబు, జి.ప్రసాద్, సంఘ అధ్యక్షుడు పి.శేఖర్ సభ్యులు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో ఆటలాడుతున్న జగన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: ఏటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపడతామని హామీని ఇచ్చిన జగన్‌రెడ్డి నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నారని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో స్వగృహం వద్ద శనివారం విలేకరులతో మాట్లాడారు. అధికారం వచ్చిన తర్వాత నిరుద్యోగులను మరచిపోయి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డీఎస్సీ పేరిట మోశానికి సిద్ధమైనారన్నారు. ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నాలుగున్నరేళ్లలో ఏమి చేశారని ప్రశ్నించారు. డీఎస్సీలో ఖాళీలు అధికంగా ఉన్న కేవలం 6100 పోస్టులకే అని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. కల్తీ మద్యం, గంజాయి అమ్మకాలతో మత్తు పదార్థాలకు కేంద్రంగా రాష్ట్రాన్ని మార్చేశాడని విమర్శించారు. టీడీపీ రాష్ట్రాన్ని పెట్టుబడులకు కేంద్రంగా మార్చితే జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా మార్చారన్నారు. రాష్ట్ర పోలీసులు గంజాయి తరలిస్తూ పక్క రాష్ట్రంలో పట్టుబడ్డారంటే ఇంతకన్నా దౌర్భాగ్యం ఇంకేమి కావాలన్నారు. జగన్ సభ కోసం విద్యార్థుల పరీక్షలను వాయిదా వేయడం దారుణమన్నారు. విద్యార్థులు, సామాన్యుల జీవితాలతో ఆటలాడుతున్న జగన్‌కు ప్రజలే తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు.

పారిశుధ్య పనులు

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు గ్రామంలో పారిశుధ్యంపై ప్రభుత్వం పట్టించుకోవకపోవడంతో జనసేన ఆధ్వర్యంలో యువకులు చందాలు వేసుకుని శనివారం పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ప్రొక్లెయిన్ సహాయంతో రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్ల పొదలు, చెత్తను తొలగించారు. ఆ చెత్తను ఊరికి దూరంగా పారవేసి, బ్లీసింగ్ వేయించారు.

చిన్నారుల భవిష్యత్తుకు అండగా టీడీపీ

పొందూరు: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దంపతుల కుమారుల చదువు, భవిష్యత్తుకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ హామీ ఇచ్చారు. గత నెలలో విశాఖలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలం మలకాం (జాడపేట) గ్రామానికి చెందిన దంపతులు కొండేటి శంకరరావు, ఝాన్సీ లక్ష్మి పిల్లలను జాడపేటలో శనివారం పరామర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో రోడ్లు సక్రమంగా లేకే ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. కనీసం రోడ్ల మరమ్మతులు చేయలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులు ఎంతవరకు చదువుకుంటే అంతవరకు ఎన్టీఆర్ చారిటబుల్ ట్రస్టు పాఠశాలల్లోగాని, నారాయణ పాఠశాలల్లోగాని ఉచితంగా చదివించే బాధ్యత తీసుకుంటామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, సర్పంచ్ జాడ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న మధుకర్‌జీ

రణస్థలం: నిరుపేదల అభ్యున్నత కోసం ప్రధాన మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మూడో దఫా మోదీని ప్రధానమంత్రి చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికునిల్లా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి మధుకర్‌జీ అన్నారు. శనివారం విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు అధ్యక్షతన ఎచ్చెర్ల నియోజకవర్గం స్థాయి శక్తి కేంద్రాలు, బూత్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ నేతృత్వంలో ప్రధాని మోదీ నాయకత్వంలో భారత దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అన్ని విధాలుగా మోదీ సహకరించారన్నారు. వైసీపీ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడుతుందని, జగన్‌రెడ్డి పాలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, పార్టీ నాయకులు రెడ్డి పావని, నడుకుదిటి రజిని, సంపతిరావు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇది ప్రజావ్యతిరేక బడ్జెట్



బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న దృశ్యం

అరసవల్లి: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వలన కార్పొరేట్లకు, పెట్టుబడి దారులకు తప్ప రైతులకు, వ్యవసాయ కూలీలకు, కార్మికులకు ఒరిగేదేమీ లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. శనివారం స్థానిక రామలక్ష్మణ జంక్షన్ వద్ద బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ బడ్జెట్‌లో కొత్త పథకాలేవీ లేవని, ఆదాయపన్ను స్లాబులు యధాతథంగా ఉన్నాయని, రైతులకు సంబంధించి పీఎం కిసాన్ సాయం కూడా పెరగలేదని, ఆహారం, ఎరువుల రాయితీల్లో 8 శాతం కోత విధించారని, విద్య, వైద్య రంగానికి నిధులు కుదింపు జరిగిందన్నారు. రాష్ట్రానికి సంబంధించి విభజన హామీల ప్రస్తావనే లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాస్, సీపీఐ నాయకుడు టి.తిరుపతిరావు, రాము, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ‘కొత్తపరిమళం’ నాటిక



నాటికలోని ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: మనుషుల్లో నెలకొన్న విద్వేషాన్ని పోగొట్టేలా ప్రదర్శించిన కొత్త పరిమళం నాటిక ఆహూతులను ఆకట్టుకుంది. శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో 292వ నెల సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా బాపూజీ కళామందిర్‌లో శనివారం శార్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సంఘం బొరివంక వారిచే ఈ నాటిక ప్రదర్శన నిర్వహించారు. బీఎంఎస్ పట్నాయక్ దర్శకత్వంలో కాంద్రేగుల శ్రీనివాస్, కేకేఎల్ స్వామి రచనలో వచ్చిన ఆ నాటిక అలరించింది. ఇందులో సుబేదార్ నాయక్‌గా పిరియా చలపతిరావు, డాక్టర్ గోపాల్‌గా మెట్ట పోలినాయుడు, ఉస్మాన్ ఖాన్‌గా ఎం.వెంకటరాజులు, రజియా బేగంగా జ్యోతి, జాఫర్‌గా సాంబమూర్తి, పాక్ సైనికుల్లా సర్వేశ్వరరావు డి.రౌలో నటించారు. హైదరాబాద్‌కు చెందిన యువ కళావాహిని అధ్యక్షులు సారిపల్లి కొండలరావు, శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య సంయుక్తంగా అక్కినేని నాగేశ్వరరావు కళాపరిషత్ సౌజన్యంతో శ్రీకాకుళం లలిత సంగీత దర్శకులు బండారు చిట్టిబాబుకు, గాయకులు తర ఆదినారాయణకు, పౌరాణిక నటులు అర్జంగి లింగమూర్తికి, సాంఘిక నటులు పిరియా చలపతికి నృత్య దర్శకులు రఘుపాత్రుని శ్రీకాంత్‌కు అక్కినేని పురస్కారాలు అందజేస్తూ ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతి, యువ కళావాహిని, అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఆమెకు అందలం

- అవినీతికి పాల్పడిన సీఎఫ్‌కు మళ్లీ పోస్టింగ్?

సంతబొమ్మాళి: అవినీతికి పాల్పడిందన్న ఆరోపణలతో తొలగించిన సీఎఫ్‌కు మరలా పోస్టింగ్ ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాలిలా ఉన్నాయి. నౌపడ పంచాయతీ పాలనాయుడుపేట సీఎఫ్ స్థానిక గ్రామైక్య సంఘం ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఖాతాల నుంచి రూ.2.40 లక్షలు స్వాహా చేసినట్లు గతంలో వెలుగు అధికారులు గుర్తించారు. సభ్యుల తీర్మానం మేరకు విచారణ చేపట్టి నిధులు స్వాహా చేసినట్లు నిర్ధారించుకుని ఆమెను విధుల నుంచి తొలగించారు. గత ఏడాది నవంబరు 19న చేసిన తీర్మానం మేరకు ఆమెను తొలగిస్తున్నట్టు మండల వెలుగు ఏపీఎం సూర్య నారాయణ అప్పట్లో ప్రకటించారు. అప్పటి నుంచి కొత్తగా ఆ పోస్టులో ఎవరినీ నియమించకుండా అధికారులు తాత్సారం చేశారు. ఆమె సదరు వెలుగు ఏపీఎంపై కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సీఎఫ్, వెలుగు అధికారుల మధ్య జరిగిన అక్రమాలు, అవినీతి బయటపడుతాయన్న నెపంతో సీఎఫ్ తో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకోవడం వల్లే ఆమెను తిరిగి సీఎఫ్‌గా నియమించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తననే సీఎఫ్‌గా నియమించినట్లు పేర్కొంటూ ఎస్‌హెచ్‌జీలు, బ్యాంకుల వద్దకు వెళ్లి ప్రచారం చేసుకుని సీఎఫ్‌గా చెలామణి అవుతోందని పలువురు మహిళా సంఘ సభ్యులు వాపోతున్నారు. అవినీతికి పాల్పడిన సీఎఫ్‌ను మరలా ఎలా నియమిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలతో ముడిపడిన ఉన్న గ్రామైక్య సంఘాల్లో ఆమె మళ్లీ అవినీతికి పాల్పడితే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్‌ను వివరణ కోరగా పాలవానిపేట గ్రామైక్య సంఘం సీఎఫ్‌ను మళ్లీ నియమించి సంగతి తన దృష్టికి రాలేదన్నారు. అవినీతికి పాల్పడిన వ్యక్తిని మళ్లీ నియమించేందుకు నిబంధనలు ఒప్పుకోవని, దీనిపై విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

బడ్జెట్ ప్రతులు దహనం చేసి నిరసన



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న వామపక్ష నేతలు

కాశీబుగ్గ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వల్ల కార్పొరేట్లకు, పెట్టుబడి దారులకు తప్ప రైతులకు, వ్యవసాయ కూలీలకు ఎటువంటి ప్రయోజనం లేదని వామపక్ష నాయకులు చాపర వేణుగోపాల్, మోహన్‌రావు, రామారావు అన్నారు. శనివారం గాంధీ విగ్రహం ఎదుట వామపక్షాలు, రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. వామపక్ష నాయకులు బాలకృష్ణ, వాసుదేవ్, రవి, వాసు, విజయ్, ఈశ్వరమ్మ, గోపి తదితరులు పాల్గొన్నారు.

నోటీసులతో ఉద్యమాలను ఆపలేరు



సరస్వతికి నోటీసు అందిస్తున్న పోలీసు సిబ్బంది

జలుమూరు: హక్కుల కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న ఉద్యోగుల సంఘ నాయకులకు నోటీసులిచ్చి ఉద్యమాలను ఆపలేరని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి, ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు మెండ రామారావు అన్నారు. సీపీఎస్ రద్దు కోరుతూ విశాఖలో ఆదివారం నిర్వహించనున్న ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమానికి హాజరు కావద్దంటూ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యా యులకు శనివారం పోలీసులు నోటీసులి వ్వడం దారుణమన్నారు. హక్కుల కోసం పోరాడే హక్కు ప్రతీ ఒక్కరికి ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను నేరస్థులుగా పరిగణించి నోటీసులివ్వడం వారి మనో భావాలను దెబ్బతీయడమేనన్నారు. ఇటువంటి చర్యలను విడనాడాలని కోరారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమలుపై కేంద్రం ఒత్తిడి

- రెవెన్యూశాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్: దేశ వ్యాప్తంగా ల్యాండ్ టైటిల్ యాక్ట్ అమలుపై కేంద్రం ఒత్తిడి తీసుకొస్తోందని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం వంశధార ఎస్ఈ కార్యాలయం ఆవరణలో శనివారం ఆయన దివంగత మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ మీద ప్రజల్లో ఆందోళన ఉందన్నారు. 20 ఏళ్ల అధ్యయనం చేసిన యాక్ట్ ఇదని, దేశమంతా ఈ యాక్ట్ అమలు చేయాలని కేంద్రం ఒత్తిడి తెస్తోందని అన్నారు. ఈ యాక్టు అమలుకు కొన్ని అడ్డంకులు ఉన్నాయన్నారు. న్యాయవాదుల సలహాలను, సూచనలను పరిగనణలోకి తీసుకుని సర్వే పూర్తి స్థాయిలో చేసిన తరువాతే చట్టం పూర్తి స్థాయిలో అమలు చేస్తామని మంత్రి తెలిపారు. కాగా విశాఖలో జరిగిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన తహసీల్దార్ హత్య కేసును మూడు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నాయని, ఈ హత్య కేసులో ఎంతటి వారున్నా విడిచిపెట్టమని చెప్పారు.

తహసీల్దార్ హంతకులను శిక్షించాలి

శ్రీకాకుళం అర్బన్: తహసీల్దార్ రమణయ్య హత్యకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని ఏపీ నాన్ గెజిటెడ్, గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని నందిగాం మండలం దివిలాడ గ్రామానికి చెందిన రమణయ్య విశాఖ రూరల్ చిన్నగదిలి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ.. ఇటీవల విజయనగరం జిల్లా బంటుమిల్లి గ్రామానికి బదిలీ అయ్యారు. హత్యకు పాల్పడిన వారిని 48 గంటల్లో పట్టుకోవాలని అసోషియేషన్ నాయకులు చౌదరి పురుషోత్తం నాయుడు, హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అలాగే తహసీల్దార్ హత్యను ఏపీ స్టేట్ కళింగ సంక్షేమ సేవా సంఘ అధ్యక్షుడు సీపాన వెంకటరమణ ఖండించారు.

ధర్మానను కలిసిన కలెక్టర్, కమిషనర్

అరసవల్లి: మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ధర్మాన ప్రసాదరావును కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్, నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా దంపతులు శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

కవిటి తహసీల్దార్‌గా లక్ష్మి

కవిటి: కవిటి మండల తహసిల్దార్‌గా ఎం.లక్ష్మి శనివారం విధుల్లో చేరారు. ఈమె విశాఖ నుంచి ఎన్నికల బదిలీల్లో భాగంగా కవిటి మండలానికి నియమించబడ్డారు. ఇప్పటివరకు డీటీగా నున్న రామచంద్రరావు పూర్తి బాధ్యతలు నిర్వహిస్తుండేవారు.

ఆదిత్యుని హుండీల లెక్కింపు రేపు

అరసవల్లి: ఈ నెల 5వ తేదీన అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి హుండీల లెక్కింపు నిర్వహిస్తున్నట్టు సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటలకు దేవదాయశాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలకమండలి సభ్యులు, అర్చకులు, భక్తులు, గ్రామ పెద్దల సమక్షంలో ఈ హుండీల లెక్కింపు జరుగుతుందన్నారు.

నేడు పీహెచ్‌సీ ప్రారంభం

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.184 లక్షలు అంచనా నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆదివారం జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయ ప్రారంభిస్తున్నట్టు జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ ఒక ప్రకటనలో తెలి పారు. ఈ ఆసుపత్రి ప్రారంభమైతే చుట్టు పక్కల 25 గ్రామాలకు ఆరోగ్య సేవలు అందుతాయని తెలిపారు.

అధికారుల గైర్హాజరుపై మండిపాటు

రణస్థలం: మూడు నెలలకోసారి జరిగిన సర్వసభ్య సమావేశనికి అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు మండిపడ్డారు. శనివారం ఎంపీపీ పిన్నింటి రజినిసాయి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. గ్రామాల్లో సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందు ఏర్పాటు చేసిన సమావేశానికి అధికారులు రాకపోవడం సరికాదని జడ్పీటీసీ టొంపల సీతారాముడు అన్నారు. ఎంపీపీ సీరియస్‌గా తీసుకోకపోవడం వల్ల అధికారులు బాధ్యతారహితంగా పనిచేస్తోన్నారన్నారు. సర్వసభ్య సమావేశానికి గైరహాజరైన అధికారుల వివరాలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీపీ కోరారు. ప్రత్యేకాహ్వానితుడు పిన్నింటి సాయికుమార్, ఎంపీడీవో రమణమూర్తి, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

రణస్థలం: ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం శనివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నికయింది. గౌరవ అధ్యక్షుడుగా పున్నాన నర్సింహులనాయుడు అధ్యక్షుడుగా సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.భాస్కరరావు, ఉపాధ్యక్షులుగా బి.రమణమూర్తి, వై.శ్రీనివాసరావు రౌతు రామకృష్ణ, కె.నూతన, గురాన ఆదినారాయణ, కార్యదర్శులుగా రెడ్డి శ్రీనివాసరావు, బి.రమణమూర్తి, బి.సూర్యనారాయణ, డి.రాఘవనాయుడు, ఎస్.సరళ, డి.ఝాన్సీ ఎన్నికయ్యారు. కన్వీనర్‌గా గంప రమేష్, పి.రామచంద్రరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా దవళ సరస్వతి, పేడాడ లక్ష్మణరావు, పైడి శ్రీరామ్మూర్తి సారథ్యంలో సజావుగా జరిగాయి.

ఆలయ ప్రారంభంపై సమావేశం

సోంపేట: సత్యనారాయణ స్వామి ఆలయం ఏప్రిల్ 21వ తేదీన ఘనంగా నిర్వహించుకుందామని ఆలయ కమిటీ తెలిపారు. ఈమేరకు ఆలయం ప్రాంగణంలో శనివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బైరి స్వామి, నిమ్మన దాసు, గుడ్ల కామేష్, పీవీ కృష్ణారావు, పి.రమేష్, నగిరి శరత్ తదితరులు ఉన్నారు.

6న పాత వాహనాల వేలం

గార: అంపోలు సమీపంలోని జిల్లా జైలు ఆవరణలో రెండు పాత వాహనాలు ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా జైలు వద్ద వేలం వేయడం జరుగుతుందని జైలు సూపరింటెండెంట్ ఎస్.నబీఖాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపయోగంలో లేని టొయోటా క్వాలిస్ (నాలుగు చక్రాలు), బజాజ్ బాక్సర్ ద్విచక్ర వాహనాలు వేలం వేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.3000 చెల్లించి పాల్గొనాలన్నారు. ఇతర వివరాలకు 9494633385, 9000505399 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌తో నీరందిస్తాం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో 2.5 లక్షల ఎకరాలకు గొట్టా బ్యారేజీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో నీరందిస్తామని, ఇందుకు రంగం సిద్ధం చేసినట్టు మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక వంశధార ఎస్ఈ కార్యాలయం ఆవరణలో శనివారం బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ప్రాజెక్టు సాధనలో కీలపాత్ర పోషించిన బొడ్డేపల్లి రాజగోపాల్ విగ్రావిష్కరణ గొప్ప విషయమన్నారు. వంశధార నేరడి ప్రాజెక్టు ద్వారా రైతులకు ఏడాది పొడుగునా సాగు నీరందించేందుకు ముఖ్యమంత్రి జగన్ ఒడిశాతో ఉన్న వివాదంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించారన్నారు. అయితే ఆ రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో వంశధార నేరడి ప్రాజెక్టు బదులుగా.. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ప్రాజెక్టుకు నీరు నింపే ప్రయత్నం ప్రారంభించామన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ మీద ప్రజల్లో ఆందోళన ఉందని, ఈ యాక్ట్ అమలు చేయాలని కేంద్రం ఒత్తిడి తెస్తుందన్నారు. విశాఖలో జిల్లాకు చెందిన తహసీల్దార్ హత్య కేసులో పోలీసు కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇప్పటికే మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారని, ఈ హత్య కేసులో ఎంతటి వారున్నా విడిచిపెట్టేదిలేదన్నారు.ల

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

ఆమదాలవలస: కులాలకు, మతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్టు స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం సభాపతి నివాసంలో విశ్వ బ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణ, తెలగ కుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో మాట్లాడారు. తమకు సామాజిక భవనాలకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. అనంతరం వినతి పత్రాలు అందించారు. ఆర్‌ఆర్ కాలనీలో నివాసానికి అనువుగా ఉన్న భూమిని గుర్తించి 26 మంది లబ్ధిదారులకు పట్టాలు సభాపతి అందించారు.